# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 317: భక్తి విశ్వాసాలలో ఉన్న శక్తి
# ఏప్రిల్ 27, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 228-233 నుండి తీసికొనబడినవి

**స్వామి! మీ ఉపన్యాసం ద్వారా భక్తి ఎంత ప్రధానమో అర్థమయ్యింది. కానీ భక్తికి మూలం విశ్వాసం. ఆ విశ్వాసం ఎలా అభివృద్ధి చేసుకోవాలి స్వామి?**

భగవాన్: ఎంత పిచ్చి ప్రశ్న అడిగావు! విశ్వాసం అభివృద్ధి చేసుకోవడం ఎలాగ అంటే విశ్వాసం అభివృద్ధి చేసుకోవడం సాధ్యమా? బజారులో కొనే వస్తువా? దానిని ఇవ్వలేవు, పుచ్చుకోలేవు. నమ్మకమనేది సహజమైన గుణం. విశ్వాసం మీ శ్వాసయే. విశ్వాసం లేకపోతే శ్వాస ఆగిపోతుంది.

విశ్వాసం ఉన్నా లేకున్నా మీ దినచర్యలు చేసుకుంటూ పోతున్నారు. మీరు చేసే ప్రతి కర్మ, ఐహికమైనా, ఆధ్యాత్మికమైనా, మీ విశ్వాసం పై ఆధారపడి ఉంటుంది. మీ బట్టలు, విలువైన చొక్కాలు, సఫారీ సూట్లు, ధోబీకి ఇస్తారు. అతను వాటిని ఉతికి, ఇస్త్రీ చేసి మళ్ళీ మీకు తిరిగి ఇచ్చేస్తాడనే నమ్మకముతో ఇస్తారు. అతను మీ బట్టలను దోచుకొని పారిపోతాడనుకుంటే మీరు ఇస్తారా? విలువైన బంగారాన్ని నగలు చేయించుకోవడానికి కంసాలికి ఇస్తారు. మీకు కొంచెం సంశయమున్నా ఆ విలువైన బంగారాన్ని ఇస్తారా?

క్షవరం చేయించుకోవడానికి మంగలి దగ్గరకు వెళ్తారు. ఒక్క నిమిషమైనా అతని కత్తి తల పై కాకుండా మెడ పైన వేస్తాడనుకుంటారా? ఆ మంగలి ఎదురుగా కూర్చొని తల వంచుతారు. అలాగే రోగి ఆసుపత్రిలో డాక్టరు చేత ఆపరేషన్ చేయించుకోవడానికి టేబుల్ మీద పడుకుంటాడు. మీ ప్రాణం అతని చేతిలో భద్రంగా ఉండదని ఏమయినా సంశయము
ఉంటుందా? ఒక ధోబీతో కానీ, కంసాలితో కానీ, మంగలితో కానీ, డాక్టరుతో కానీ చేసే వ్యవహారాలన్నీ విశ్వాసముతోనే చేస్తారు. కనుక ఈ విశ్వాసమనేది మానవునికి దేవుడిచ్చిన వరం. విశ్వాసం లేకపోవడం అసహజము, కృత్రిమము. కానీ విచిత్రమేమంటే దేవునిపై తప్ప అందరి పైనా విశ్వాసం ఉంటుంది మీకు. అది దురదృష్టం కాదా?

భక్తి విశ్వాసములు రెండు కన్నుల వంటివి. లేక సైకిల్ కి ఉన్న రెండు చక్రాల వంటివి. లేక పక్షి యొక్క రెండు రెక్కల వంటివి. విశ్వాసం లేకుంటే ఒక చిన్న చీమ కూడా కదలలేదు. పక్షికి తన రెక్కలపై విశ్వాసం లేకుంటే ఎగరలేదు. ఒక పక్షి ఒక కొమ్మపై కూర్చొని ఉంటే ఆ కొమ్మ ఊగుతున్నా సాగుతున్నా ఆ పక్షి ఏమి పట్టించుకోదు. ఎందుకు? ఆ పక్షికి ఆ కొమ్మ పైన కాకుండా తన రెండు రెక్కల పై విశ్వాసముంది కనుక. అందువలన అన్నీ విశ్వాసం పైనే ఆధారపడి ఉన్నాయి.

నీకు మీ తండ్రి ఎలా తెలుసు? నీకు విశ్వాసమున్న తల్లి మీ తండ్రిని చూపించింది కనుక. లేకుంటే మీ తండ్రి ఎవరో తెలిసే అవకాశమే లేదు. తిథులు, వారాలు క్యాలెండరులో చూసి తెలుసుకుంటారు. లేకుంటే ఈరోజు సోమవారమని, మే నెలలో 14వ తారీకు అని ఎలా తెలుసు? ఈ రోజు తేదీలు వారాలు వ్రాసి ఉన్న బోర్డు పట్టుకోలేదు కదా.

మీరు All India Radio ద్వారా విన్న వార్తలు, వార్తాపత్రికలో చదివినవి నిజమే అని నమ్మకం ఉంది. రేడియోలో విన్నవి, టీవీలో చూసినవి, పేపరులో చదివినవి, ఇవన్నిటి మీద మీకు విశ్వాసం ఉంది కానీ ఋషివాక్యముల మీద, వేదాల మీద విశ్వాసం లేదు. వేదాలని ఈశ్వరీయ, అపౌరుసేయ అని అంటారు. అంటే దేవుని కల్పనలని అర్థం, కానీ మీకు వాటిపై విశ్వాసం లేదు. ఎంత విచిత్రమో, ఎంత దురదృష్టకరమో ఆలోచించుకోండి.

స్వామి**!** కొంత మందికి భగవంతునిపై భక్తి ఎందుకు ఉండదు**?** భక్తికి వారి జీవితాలలోనే చోటు ఉండదు**,** ఎందుకు**?**

భగవాన్**:** విషయ సుఖాలపై ఆసక్తి ఉంటే దేవునిపై ఆసక్తి ఉండదు. భవిష్యత్తు గురించి అర్థం లేని చింతలు, అదుపు లేని కోరికలు, గాలిలో మేడలు ఇలాంటివే వారి జీవితం. ఇంకా ఇంకా ఉన్నత స్థాయికి వెళ్లాలని అత్యాశలు, సంసారం పైన, లోకం పైన అధికమైన మమకారం, ఇలాంటి వాటి వల్ల దేవునిపై ఆసక్తి ఉండదు. ఇంతకన్నా వేరే కారణాలేవీ లేవు.

పిల్లలు ఆడుకొనే seesawలో ఒక కొన పైకి వెళ్తే ఇంకో కొన కిందకి వస్తుంది. అదే విధంగా ప్రపంచ విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే భగవంతునిపై ప్రేమ తగ్గుతుంది. కానీ దేవునిపై ఎక్కువ ప్రేమ ఉంటే ప్రపంచపు విషయాలపై ఆసక్తి తగ్గుతుంది. తక్కెడ కూడా ఇలాగే పని చేస్తుంది కదా?

ఇంకొక ఉదాహరణ. ఒక ఐసుకాంతం ఇనుప రజసును ఆకర్షిస్తుంది. కానీ ఒకొక్క సారి ఆకర్షించదు. ఎందుకు? ఆ ఇనుప ముక్కలకు తుప్పు పట్టినా, దుమ్ము పట్టినా అది ఆకర్షించ లేదు. అదే విధంగా మానవులకు విషయ వాంఛలు అనే తుప్పు, దుమ్ము పట్టి ఉంటే భగవంతుడు అనే ఐసుకాంతం చేత ఆకర్షింప బడడు. ఇప్పుడు అర్థమయ్యిందా కొంత మందికి భగవంతునిపై భక్తి ఎందుకు ఉండదని?

స్వామి**!** మా ఆధ్యాత్మిక విద్యకి దారి చూపండి**.** దానిని ఎలా కొనసాగించాలి**?** నదిలో ప్రవాహం వలెనా**?** దానికి నియమ నిబంధనలేమిటి**?**

భగవాన్**:** 'న శ్రేయో నియమం వినా' అంటే అన్నిటికీ హద్దులుండాలి, లేకుంటే అనేక ప్రమాదాలకు గురి అవ్వొచ్చు. నదికి రెండు వైపులా ఉన్న గట్టుల వలన ఆ ప్రవహించే నీరు వ్యవసాయానికి ఉపయోగించ వచ్చు. అదే విధంగా జీవితమనే నదికి రెండు గట్టులు ఉంటాయి. ఒక వైపున 'సంశయాత్మ వినశ్యతి' అంటే సంశయిస్తే నాశనానికి దారి తీస్తుంది. ఇంకొక వైపున 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అంటే శ్రద్ధతో జ్ఞానం లభిస్తుంది.

మీ జీవితమనే నది ఈ రెండు గట్టుల మధ్య ప్రవహించాలి. మీ విశ్వాసం ఎప్పుడూ అస్థిరంగా ఉండకూడదు. మీ నమ్మకము ఎప్పుడూ స్థిరంగా, ధృడంగా ఉండాలి. ఏ కష్టనష్టాల వల్ల మీ విశ్వాసాన్ని కోల్పోకూడదు.
విశ్వాసం లేని జీవితం నిండా కన్నాలుండే కుండ వంటిది. మొక్కల వేర్లకు మాత్రమే నీరు పోస్తాము. కాడకి, కొమ్మలకి, ఆకులకి విడివిడిగా నీరు పోయక్కర లేదు. కానీ ఆ నీరు మొక్క అంతటికీ చేరుతుంది. అదే విధంగా విశ్వాసమనే నీరు మీ జీవితపు వేర్లకు పోస్తే మీ జీవితమంతా బాగు పడుతుంది. అదే లేకుంటే ఆ మొక్క చచ్చిపోతుంది. పొయ్యిలో పెట్టే కట్టె అవుతుంది. సంశయం అనేది ఉంటే అన్నీ చచ్చిపోతాయి. సంశయం ఉంటే ఇంక ఏ చదువులూ సాధనలూ పనికి రావు.

ఒక చిన్న ఉదాహరణ. ఒక గ్రామంలో ఒక పండితుడు ఉన్నాడు. ఒక పాలమ్మాయి పక్క ఊరి నుంచి రోజు పడవలో వచ్చి అతనికి పాలు పోస్తుంది. ఒక రోజు కొంచెం ఆలస్యమయ్యింది. ఆ పండితుడు ఎందుకు ఆలస్యమైనదని అడిగాడు.

"అయ్యా, నేను రోజూ పడవలో నది దాటి రావాలి. ఆ పడవవాడు మొదటి సారి పెద్దవారిని ఎక్కించుకుంటాడు. అందుకని నేను రెండో పడవలో రావాలి. అందుకే ఆలస్యమయ్యింది," అని చెప్పింది.

అప్పుడు ఆ పండితుడు చెప్పాడు, "చూడు, అసలు పడవలో ఎందుకు రావాలి? నీ పాల కుండలను నెత్తిపైన పెట్టుకొని రామ నామమును తలచుకుంటూ నది దాటు. ఆ నదిలో నీరు పక్కకు తప్పుకొని నీకు దారి ఇస్తుంది. అప్పుడు ఆ పడవ కొరకు ఆగనవసరము లేదు."

ఆ పాలమ్మాయి పండితుడు చెప్పింది నమ్మి, మరుసటి రోజు సరిగ్గా సమయానికి వచ్చి పాలు తెచ్చి ఇచ్చింది. పండితుడు అడిగితే ఆయన చెప్పింది పాటించటం వల్ల సమయానికి వచ్చానని చెప్పింది.

ఆ పండితుడు ఆశ్చర్యపోయాడు. ఆమె చెప్పిన మాటలు నమ్మలేదు. ఆమెతో పాటు నదికి వెళ్ళాడు. "నువ్వు తిరిగి వెళ్ళేడప్పుడు నేను నీ వెనుకే వస్తాను. నీకు ఆ నది దారి ఎలా ఇస్తుందో చూస్తాను," అన్నాడు.

ఇద్దరూ నది వద్దకి చేరుకున్నారు. పాలమ్మాయి పండితుడు చెప్పినట్లు రామ నామము తలచుకుంటూ నదిలోకి నడిచింది. ఆ పండితుడు కూడా అలాగే చేయాలని బట్టలు తడిచి పోతాయేమో అని పంచెను మోకాళ్ళ పైకి ఎత్తి పట్టుకొని, మునిగి పోతానేమో అని భయం భయంగా నదిలో అడుగు పెట్టాడు. ఆ సంశయంతో అతను నిజంగానే మునిగి పోయాడు. అతని మాటపై అతనికే నమ్మకం లేక మునిగి పోయాడు. విశ్వాసమున్నందు వల్ల పాలమ్మాయి నీటిపైన నడవగలిగింది.

శ్రద్ధ అనేది నదికి అవతల వైపున ఉండే వొడ్డు. శ్రద్ధ ఉంటే జ్ఞానం లభిస్తుంది. మీరు చేసే పని ప్రేమతో చేస్తే మీకు శ్రద్ధ లభిస్తుంది. పూర్తి విశ్వాసము, ప్రేమ ఉంటే శ్రద్ధ కూడా ఉంటుంది.

వచ్చే వారం మరో ఉపదేశంతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు.

ఓం శ్రీ సాయి రాం!